

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 21-11-2025 | సంపుటి - 25 | సంచిక -186 | రూ : 4 | పేజీలు: 8

### రిజర్వేషన్లు 50 శాతం మించకుండా..

## ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక




2లో

- పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన డెడికేషన్ కమిషన్
- పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా నివేదిక
- డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేయనున్న ప్రభుత్వం

## విరాళాల పేరిట మోసం..

భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ

2లో

### ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివెల్‌లో బాలకృష్ణకు

## అరుదైన గౌరవం



2లో

# తెలుగులో.. మాట్లాడండి

- త్వరలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం
- కలెక్టర్లు, మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్
- ఇంగ్లీషులో మాట్లాడే ప్రయత్నం చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్
- స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నందున తెలుగులో మాట్లాడాలని సూచన



2లో

### ముఖ్యమంత్రిగా 10వ సారి

## ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్

- హాజరైన మోదీ, చంద్రబాబు
- పాట్నాలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమం
- నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం



2లో



2లో

### భారత వాయుసేన స్వరూపాన్నే

## మార్చే ప్రతిపాదన..

పుతిన్ పర్యటనకు ముందు రష్యా కీలక అడుగు

- సుఖోయ్-57 స్టెల్త్ ఫైటర్ జెట్ టెక్నాలజీ బదిలీకి సంసిద్ధత
- పుతిన్ భారత పర్యటనకు ముందే కీలక పరిణామం

### అన్నదాతల సంక్షేమానికి

## దృఢ సంకల్పం

- నాబార్డు ధరిత్రి సదస్సులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




2లో

### ఈ నెల 24 నుంచి

# రైతన్నా, మీకోసం

- వ్యవసాయంలో పంచ సూత్రాలపై ఏడు రోజులపాటు కార్యక్రమాలు
- అగ్రిటెక్‌పై రైతుల్లో చైతన్యం తీసుకువద్దామని పిలుపు
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

2లో



# ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్...

బీహార్, నవంబర్ 20 : జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది. నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

## విరాళాల పేరిట మోసం..
# భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ

తిరుమల, నవంబర్ 20 : భక్తులను తప్పుదోవ పట్టించి విరాళాలు సేకరిస్తున్న కొన్ని సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ (Global Hindu Heritage Foundation), సేవ్ టెంపుల్స్ డాట్ ఆర్గనైజేషన్ (savetemples.org) వంటి సంస్థలు మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ సంస్థలు తప్పుడు ప్రచారం చేస్తూ, భక్తుల మనోభావాలతో ఆడుకుంటూ విరాళాలు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని నాయుడు పేర్కొన్నారు. ఈ నెల 29న తిరుమల, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాలను పుణ్యక్షేత్రాలుగా ప్రకటించేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈ సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇలాంటి అనుమానాస్పద సంస్థలు చేసే ప్రచారాలను నమ్మవద్దని, వారి వలలో పడి విరాళాలు ఇచ్చి మోసపోవద్దని భక్తులకు ఆయన సూచించారు. భక్తులు అప్రమత్తంగా ఉండి, ఇలాంటి మోసపూరిత చర్యలను తిప్పికొట్టాలని టీటీడీ ఛైర్మన్ కోరారు.

# భారత వాయుసేన స్వరూపాన్నే మార్చే ప్రతిపాదన..

రష్యా, నవంబర్ 20 : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే నెల భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో, భారత వాయుసేన భవిష్యత్తును మార్చేసే ఒక కీలక సైనిక ప్రతిపాదనను మాస్కో తెరపైకి తెచ్చింది. ఐదో తరం సుఖోయ్ 57 (Su57) స్టెల్త్ ఫైటర్ జెట్‌కు సంబంధించిన పూర్తి టెక్నాలజీని బదిలీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకు ఏ దేశం కూడా ఇంతటి ఉన్నత స్థాయి రక్షణ సాంకేతికతను భారత్‌కు అందించడానికి ముందుకు రాలేదు. రష్యా ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ రోస్‌టెక్ సీఈఓ సెర్గీ చెమెజోవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దుబాయ్ ఎయిర్ షో 2025 సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలుత రష్యాలో తయారైన సుఖోయ్ 57 ఫైటర్లను భారత్‌కు సరఫరా చేసి, ఆ తర్వాత దశలవారీగా వాటి ఉత్పత్తిని పూర్తిగా భారత్‌కు తరలిస్తామని తెలిపారు. అంతేకాకుండా, సింగిల్ ఇంజిన్ స్టెల్త్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అయిన సుఖోయ్ 75 చెక్‌మేట్‌ను కూడా భారత్‌కు ఆఫర్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంజిన్లు, సెన్సార్లు, ఏఈఎస్ఏ రాడార్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) టెక్నాలజీ, స్టెల్త్ మెటీరియల్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేస్తామని రష్యా స్పష్టం చేసింది. భారత్‌పై ఆంక్షలు ఉన్నప్పుడు కూడా ఆయుధాలు సరఫరా చేసి అండగా నిలిచామని, ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా బలమైన భాగస్వామ్యం ఉందని చెమెజోవ్ గుర్తుచేశారు. పాశ్చాత్య దేశాలు నిరాకరిస్తున్న కీలక టెక్నాలజీని రష్యా ఆఫర్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. డిసెంబర్‌లో జరగనున్న 23వ భారత్‌రష్యా వార్షిక సదస్సు కోసం పుతిన్ భారత్‌కు రానున్నారు. ఈ పర్యటనలో రక్షణ రంగానికి సంబంధించి కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ పర్యటనకు సంబంధించిన సన్నాహక చర్చలు ప్రారంభమయ్యాయి.

# ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివెల్‌లో బాలకృష్ణకు అరుదైన గౌరవం

* **నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న బాలకృష్ణ**
* **శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించిన గవర్నర్, సీఎం, కేంద్రమంత్రి**
* **గోవాలో ఈ నెల 28 వరకు కొనసాగనున్న ఫిలిమ్ ఫెస్టివెల్**

గోవా, నవంబర్ 20 : గోవా వేదికగా జరుగుతున్న 56వ ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివెల్ ఆఫ్ ఇండియా వేడుకలో ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణను సత్కరించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బాలకృష్ణకు ఈ అరుదైన గౌరవం లభించింది. గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి మురుగన్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ఆయనను శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈరోజు వైభవంగా ప్రారంభమైన ఇంటర్నేషనల్ ఫిలిమ్ ఫెస్టివెల్ ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రారంభ వేడుకకు నటుడు అనుపమ్ ఖేర్ తదితరులు హాజరయ్యారు. ముగింపు వేడుకలో సూపర్ స్టార్ రజనీకాంత్‌ను సత్కరించనున్నారు. ఆయన కూడా నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.

# అన్నదాతల సంక్షేమానికి దృఢ సంకల్పం

హైదరాబాద్: తెలంగాణలో ప్రజాప్రభుత్వం దృఢసంకల్పంతో అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తోందని... సంక్షోభ సమయాల్లోనే కాదు, వారి అభివృద్ధి పయనంలో తోడుగా ఉంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సవాళ్లను అధిగమించేందుకు రైతులు సాంకేతికతను అందిపుచ్చుకొని ఆధునిక సేద్యం వైపు సాగాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నాబార్డ్, ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధరిత్రి సదస్సు (ఎర్త్ సమిట్)కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ''దేశంలో మొదటిసారిగా దాదాపు 22 లక్షల రైతు కుటుంబాలకు రూ.21,000 కోట్ల రుణమాఫీని అమలు చేశాం. పంటల కొనుగోలు వ్యవస్థను విస్తరించి... పారదర్శకంగా మార్చాం. రైతులకు నేరుగా, సమయానుసారం మద్దతు అందేలా రైతు భరోసా అమలు చేస్తున్నాం. కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతికతలు వ్యవసాయానికి అవసరంగా మారాయి. డ్రోన్ల ఆధారిత పంట నిర్వహణ, భూసార విశ్లేషణ వంటివి అన్నదాతకు ఉపయుక్తంగా ఉన్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న నాబార్డుతో తెలంగాణ ప్రభుత్వం కలిసి నడుస్తుంది'' అని భట్టి పేర్కొన్నారు.

* **నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం: తుమ్మల**

సదస్సులో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... ''వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాటలు వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. పారిశ్రామిక రంగంతో పాటు వ్యవసాయ రంగంలోనూ పెద్దఎత్తున అంకురాలు రావాలి.

# తెలుగులో మాట్లాడండి: కలెక్టర్‌కు ముఖ్యమంత్రి సూచన

హైదరాబాద్, నవంబర్ 20 :వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా ఒక కలెక్టర్ ఆంగ్లంలో వివరాలు తెలియజేస్తుండగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుగులో మాట్లాడాలని సూచించారు. మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం నేపథ్యంలో జిల్లా కలెకరు, జిల్లా మహిళా సమాఖ్యలు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆంగ్లంలో వివరాలు వెల్లడించే ప్రయత్నం చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడి కలుగజేసుకుని తెలుగులో మాట్లాడాలని అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు కూడా ఉన్నారని, వారందరికీ అర్థమయ్యేలా వీలైనంత వరకు తెలుగులో మాట్లాడాలని ఆయన సూచించారు. దీంతో కలెక్టర్ గరిమ తెలుగులో వివరాలు వెల్లడించారు.

## ఈ నెల 24 నుంచి రైతన్నా, మీకోసం
# 10 వేలమందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, నవంబర్ 20 : వ్యవసాయ రంగంలో సమూల మార్పుల ద్వారా సాగును లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి కార్యక్రమాలు చేపట్టనుంది. 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి రైతు ఇంటికి వెళ్లనున్నారు. డిసెంబర్ 3వ తేదీన రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొననున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సహా 10 వేల మందితో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాతల సంక్షేమం కోసం, సాగు విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై ముఖ్యమంత్రి ప్రకటించిన పంచ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించే అంశంపై టెలికాన్ఫరెన్స్‌లో ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి 'మీకోసం రైతన్నా' పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ఈ కార్యక్రమంలో కీలక భూమిక పోషించనున్నారు. ఈ సందర్భంగా టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ "గత 7 నెలలుగా రైతులను, వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్తున్నాం. ఇప్పటికే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద దాదాపు 46.50 లక్షల మందికి పైగా రైతులకు రెండు విడతలుగా రూ.14 వేలు జమ చేశాం. రెండు విడతల్లో కలిపి రూ.6,310 కోట్లు రైతులకు చెల్లించాం. బిందు సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం కూడా చేపట్టాం. ఇలాంటి వాటితో పాటు వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడం ద్వారా అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను ప్రకటించాం. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్ధతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టాం. ఈ పంచసూత్రాలను ప్రతి రైతుకే కాకుండా రైతు కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలి. రైతులతో పాటు పాడి రైతులు, పౌల్ట్రీ, గొర్రెల పెంపకం దారులు, ఆక్వా, ఉద్యాన, సెరీ కల్చర్ రైతులకూ అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ముందుండి చేపట్టాలి. దీంతో పాటు వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించాలి. ప్రతి రైతు సేవా కేంద్రాల్లో యాక్షన్ ప్లాన్ చేయాలి" అని పేర్కొన్నారు.

* **ప్రకృతి సేద్యం: అగ్రిటెక్ విధానాలతో కలిగే లాభాలు వివరించాలి**

రైతులకు వ్యవసాయం గిట్టుబాటు అయ్యేలా ఆధునిక పద్ధతుల ద్వారా పంటలకు మరింత విలువ జోడించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని అన్నారు. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటు అవుతుందని, ప్రకృతి సేద్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. దీని వల్ల భూసార రక్షణతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే ఆయా ఉత్పత్తులకు సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ చేస్తున్నామని, రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రోత్సహించాలని అన్నారు. కడపలో ప్రకృతి సాగును కూడా పరిశీలించానని, ఆ సాగు రైతులు చాలా సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఎరువుల దుకాణాల కంటే గ్రోమోర్ కేంద్రాల్లోని ఎరువుల ధర తక్కువగా ఉందని అన్నారు. "రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తే ఉత్పత్తులకు మేలు కలుగుతుంది. రైతుల ఏ పంటలు సాగు చేశారు, వారికి ఎటువంటి సాయం కావాలనేది నేరుగా తెలుసుకోవాలి. సాగులో పురుగుమందుల వినియోగం వల్ల జరిగే నష్టాలను రైతులకు స్పష్టంగా అర్థమయ్యేలా వివరించాలి. దీంతో పాటు తక్కువ వినియోగం వల్ల కలిగే లాభాలను, సేంద్రీయ సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఏ స్థాయిలో ఉందనేది వివరించాలి. పూర్తి వాటర్ మేనేజ్మెంట్ ద్వారా రిజర్వాయర్లను నింపగలిగాం. అలాగే సమర్థ నీటి నిర్వహణ, భూసార పరీక్షలు, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు వంటి విషయాలను రైతులకు చెప్పాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు 50 శాతం మించకుండా..
## ప్రభుత్వానికి డెడికేషన్ కమిషన్ నివేదిక

హైదరాబాద్, నవంబర్ 20 : తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేషన్ కమిషన్ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి కీలక నివేదికను సమర్పించింది. రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. రిజర్వేషన్ల అంశాన్ని తేల్చడానికి ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా నివేదిక సమర్పించింది. డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈ నెల 24వ తేదీలోపు ఎన్నికల తేదీలను ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో అదే రోజున విచారణ జరపనుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ నెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. తెలంగాణ వ్యాప్తంగా 12,733 పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో డిసెంబర్ 16 వరకు మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది.

# విద్యార్థుల చేతిలోనే భవిష్యత్తు : నారా భువనేశ్వరి

హైదరాబాద్, నవంబర్ 20 : క్రమశిక్షణ, పట్టుదల ఉంటే విజయం మన సొంతమవుతుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర కీలకమైందని, చిన్నతనం నుంచే పిల్లలకు విలువలు నేర్పించాలని అన్నారు. 2వ రోజు కుప్పం నియోజక వర్గం పర్యటనలో భాగంగా పరమ సముద్రం గ్రామంలో నారా భువనేశ్వరి పర్యటించారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గురుకుల పాఠశాలలను సందర్శించారు. కేజీబీవీ నుంచి గురుకుల పాఠశాలకు విద్యార్థులతో కలిసి ఆటోలో ప్రయాణించారు. అనంతరం సామగుట్టపల్లిలో విలువల బడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు.

* **విజయానికి షార్ట్ కట్ లేదు**

"పిల్లల భవిష్యత్ బాగుండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మీపై ఉంది. ఆటపాటతో పాటు కెరీర్‌పై కూడా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కష్టపడకుండా విజయం రాదు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు. ఎన్టీఆర్, అబ్దుల్ కలామ్, ధీరూభాయ్ అంబానీ, చంద్రబాబు వంటి వారంతా ఎంతో కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. చంద్రబాబు గారు చిన్నతనంలో 6 కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవారు. నాకు తల్లిదండ్రులే స్ఫూర్తి. మా నాన్నగారు ఎంతో కష్టపడి పైకి వచ్చారు. చిన్న వయసులో ఇంటింటికీ వెళ్లి పాలు అమ్మేవారు. ఆ తర్వాత స్కూల్ కి వెళ్లి చదువుకునే వారు. ఎంతోమంది తల్లిదండ్రులు స్థోమత లేకపోయినా వారి శక్తికి మించి పిల్లలను చదివిస్తున్నారు. వారు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని విద్యార్థులకు నారా భువనేశ్వరి సూచించారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి పెట్టాలని, క్రీడల్లో రాణించే విద్యార్థులకు సహాయం చేయటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కస్తూర్బా విద్యాలయానికి 20 కంప్యూటర్లు, నర్సింగ్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు అందేలా ఏర్పాట్లు చేస్తామని" నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు.

* **పిల్లలను విలువలతో పెంచాలి**

"విలువల బడి వ్యవస్థాపకులు లెనిల్ గారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత నేర్పించి బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ బడులను ఏర్పాటు చేయడం గొప్ప విషయం. నా చిన్నతనంలో స్కూల్లో మోరల్ సైన్స్ ఒక సబ్జెక్ట్ గా ఉండేది. ఇప్పుడు మళ్లీ పాఠశాలల్లో ఆ సబ్జెక్ట్ తీసుకొచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు నా అభినందనలు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు క్లోజ్ అనే బోర్డులు పెట్టడం చాలా సంతోషదాయకం. నేటి సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయి. టెక్నాలజీని చెడు కోసం ఉపయోగిస్తున్నారు. పిల్లల పెంపకంలో తల్లుల పాత్ర కీలకమైంది. చిన్నతనంలోనే విలువలు, సంస్కారం నేర్పాలి.

# ఒకే చోట జ్యోతిర్లింగాల దర్శనం.. మహాద్భుతం

* పుణ్యలింగేశ్వరా స్వామి దర్శనంతో నా జీవితం ధన్యమైంది
* సుప్రసిద్ధ సినీనటుడు రాజేంద్రప్రసాద్





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అన్ని జ్యోతిర్లింగాలను ఒకే చోట దర్శనం చేసుకోవడం మహా అద్భుతమని సుప్రసిద్ధ సినీనటుడు, నట కిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ లో వెలిసిన శ్రీ పుణ్యలింగేశ్వరా స్వామి ఆలయాన్ని, అమ్మా నాన్న అనాథుల పుణ్యక్షేత్రాన్ని గురువారం దర్శించుకున్నారు. కార్తీక మాసం చివరి రోజైన గురువారం పుణ్యలింగేశ్వర స్వామి క్షేత్రంలో పంచ మహా యాగాల పూర్ణాహుతిని సమర్పించారు. ఆలయ వ్యవస్థాపకులు శ్రీ శంకర గురూజీతో పాటు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా యాగాలను ముగించారు. అమ్మానాన్న అనాధాశ్రమం లోని అనాధలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇప్పటివరకు తాను ఎన్నో సినిమాల్లో నటించానని, అయితే "ఆ నలుగురు" చిత్రం మాత్రమే తనకు ఎంతో తృప్తి ఇచ్చిందన్నారు. అలాగే ఒకే చోటా అన్ని లింగాలు ఉన్న శ్రీ పుణ్య లింగేశ్వరా స్వామి ఆలయ దర్శనం చేసుకోవడం అంతే తృప్తి ఇచ్చిందన్నారు. జీవితంలో తాను ఎన్నో ఆలయాలు సందర్శించినప్పటికీ శ్రీ పుణ్యలింగేశ్వరా స్వామి ఆలయ దర్శనంతో తన జీవితాన్ని ధన్యం చేసుకున్నానన్నారు. జ్యోతిర్లింగాలన్నీ ఒకే చోట చూడాలనుకుంటే చౌటుప్పల్ లోని పుణ్యలింగేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి తరలిరావాలని సూచించారు. భవిష్యత్తులో ప్రపంచంలోని నలుమూలల నుంచి పుణ్య లింగేశ్వర స్వామిని దర్శించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకే చోటా మానవ సేవా, మాధవ సేవా ఈ పుణ్యక్షేత్రంలో జరగడం గొప్ప విషయమని కొనియాడారు. అమ్మ నాన్న అనాధాశ్రమం, పుణ్యలింగేశ్వర స్వామి పుణ్యక్షేత్ర వ్యవస్థాపకులు శ్రీ శంకర గురూజీని ప్రత్యేకంగా అభినందించారు.

## నిబద్ధత కలిగిన కాంగ్రెస్ కార్యకర్త చెరుకు సత్తయ్య గౌడ్

* ఉబ్బు వెంకటయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధత కలిగిన కార్యకర్త చెరుకు సత్తయ్య గౌడ్ అని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం రాజీవ్ స్మారక భవన్ లో చెరుకు సత్తయ్య గౌడ్ మొదటి వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ చెరుకు సత్తయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ నిబద్ధత కలిగిన కార్యకర్త అన్నారు. కుటుంబం మొత్తం కాంగ్రెస్ పార్టీ ఎంతో సేవా చేసారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహా గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, చింతల సాయిలు, ఊదరి నర్సింహా, మాజీ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం ఏ ఖయ్యూం, నల్ల నరసింహ, మాదని గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ కుటుంబాలకు రాజీవ్ ట్రస్ట్ అండ

* రూ.15వేల ఆర్థికసాయం అందజేత



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ కుటుంబాలకు రాజీవ్ స్మారక ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఖయ్యూం, ఆర్గనైజేషన్ సెక్రటరీ నల్ల నరసింహాలు అన్నారు. రాజీవ్ స్మారక ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్లసింగారం గ్రామ 2వార్డుకు చెందిన సుర్వి రాధ కుటుంబానికి గురువారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యకర్తల కుటుంబాలను కాపాడుకోవడంలో రాజీవ్ స్మారక ట్రస్ట్ బాధ్యతగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ కృష్ణ, ప్రధాన కార్యదర్శి మట్టపల్లి శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ మందారి మార్క్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొనకొండ బాలయ్య, సుక్క నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీపార్క్ లో ట్రాన్స్ ఫార్మర్ ప్రారంభం

- చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్న కొండూరు రోడ్డు గాంధీపార్క్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ ను చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ గాంధీ పార్క్ పరిసర ప్రాంతంలో లో వోల్టేజ్ సమస్య తలెత్తుదున్నారు. విద్యుత్ సరఫరాకు అనుగుణంగా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎస్ఈ సుధీర్ కుమార్, డీఈ మల్లికార్జున్ గౌడ్, ఏడీ పద్మ, ఏ ఈ సతీష్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య గౌడ్, శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, షాది ఖానా చైర్మన్ కరీమ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసర్ల శ్రీనివాసరెడ్డి, చింతల సాయిలు, చెరుకు లింగస్వామి గౌడ్, మాదని గోపాల్, ఎండి ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

: రామచందర్‌రావు

హైదరాబాద్: ఆపరేషన్ కగార్ విషయంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ కేంద్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు బాధ్యతారాహిత్యమని, తీవ్రంగా ఖండిస్తున్నామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం మావోయిస్టులను కక్షపూరితంగా చంపుతోందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణలో మావోయిస్టుల దాడులు, హింసతో నాశనమైన కుటుంబాలు అనేకం ఉన్నాయని.. మాజీ స్పీకర్ శ్రీపాదరావు, చిట్టెం నర్సిరెడ్డి, రాగ్యానాయక్ వంటి నేతలను కూడా మావోయిస్టులే చంపారన్నారు. ఆ సంఘటనలను మర్చిపోయి నక్సల్స్‌ను 'పేదల కోసం పోరాడిన వారు' అని చెప్పడం దుర్మార్గమని రామచందర్‌రావు విమర్శించారు.



## అయ్యప్ప మాలదారులకు నిత్య అన్న ప్రసాద వితరణ

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని శ్రీ బాలాజీ రామకృష్ణదేవాలయంలో అయ్యప్ప స్వామి నిత్య అన్న ప్రసాద వితరణ 11వ రోజు నిర్వహించారు. శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయం అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప స్వామి మలాదారులకు కానుగు నరసింహపార్వతమ్మ దంపతుల కుమారులు సాయిరాం, శివరాం, రఘురాంలు గురువారం నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య అన్న ప్రసాద దాతలు మాట్లాడుతూ అయ్యప్ప మాలదారులకు ప్రసాద వితరణ నిర్వహించడం తమ పూర్వ జన్మ సుకృతమని, తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అన్న ప్రసాద దాతల కుటుంబానికి అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఏళ్ల వేళల ఉండాలని, అయురూ ఆరోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు అయ్యప్ప స్వామి ప్రసాదించాలని మనసారా అయ్యప్ప స్వామి మాలదారులు, శివదీక్ష మాలదారులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అన్న ప్రసాద వితరణ నిర్వాహకులు తొర్పునూరి నర్సింహ గౌడ్, సన్నిధానం గురుస్వామి చెరుకు అశోక్ గౌడ్, కళ్యం నాగరాజు గౌడ్, చెవగోని మహేష్ గౌడ్, వరగంటి వెంకటేష్ గౌడ్, స్వాములు పోల్దాస్ రాజు, చెరుకు రాము గౌడ్, దాసరి మురళిస్వామి, చెవగోని గణేష్ గౌడ్, మార్గం శేఖర్ యాదవ్, బందారపు శివగౌడ్, అందోజు సన్నిధ్ చారి, బొడిగె భాను గౌడ్, చెరుకు చైతన్య, చందు గౌడ్, తొర్పునూరి సాయి, తొర్పునూరి సాయిలుగౌడ్, శివ ప్రసాద్ గౌడ్, కళ్యాణ్ స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు పగిడోజు సంతోష్ కుమార్ శాస్త్రి, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సిసి రోడ్ నిర్మాణ పనులను అడ్డుకున్న స్థానికులు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : మంజూరైన రోడ్డు కాకుండా.. తక్కువ వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌ను పనులు చేయకుండా స్థానికులు అడ్డుకున్న ఘటన ఇది. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామ పంచాయతీలో గత సెప్టెంబర్ 15వ తేదీన రూ.28 లక్షల అంచనా విలువతో పూనెం నర్సయ యఇంటి నుండి ఎస్. కె. కరీం ఇంటి వరకు, మాదిగ్రబోల్ రోడ్డు నుండి జజ్జర లింగయ్య ఇంటి వరకు, తాళ్లపల్లి రత్న ఇంటి నుండి గుమ్మడి సత్యవతి ఇంటి వరకు, అంతడబ్బుల కృష్ణ ఇంటి నుండి మహ్మద్ కరీం ఇంటి వరకు సీఆర్ఆర్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. అయితే శంకుస్థాపన సమయంలో 12 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాస్తామని అధికారులు చెప్పారని స్థానికులు పేర్కొన్నారు. కాని గురువారం రోడ్డు పనులు చేపట్టేందుకు వచ్చిన కాంట్రాక్టర్ కేవలం 10 అడుగుల వెడల్పుతో రోడ్డు పనులు చేపట్టడంతో స్థానికులు ఈ విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ సమాధానం చెప్పకపోవడంతో స్థానికులు రోడ్డు పనులను అడ్డుకున్నారు. 12 అడుగుల రోడ్డు నిర్మించాలని, లేదంటే పనులు నిలిపివేయాలంటూ ఆందోళన చేశారు.

## బిఆర్ఎస్‌ను కట్టడి చేసేందుకు కాంగ్రెస్, బిజెపి కలిసి కుట్రలు

* కెటిఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బిఆర్ఎస్‌ను కట్టడి చేసేందుకు కాంగ్రెస్, బిజెపి కలిసి కుట్రలు చేస్తున్నాయని కెటిఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై కక్ష సాధింపు చర్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఫార్ములా ఈ కార్ రేసులో ఎలాంటి అవినీతి జరగకుండానే విచారణకు ఎసిబి అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంలో కాంగ్రెస్, బిజెపి కుట్రలు తేటతెల్లమయ్యాయని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేఖత వచ్చినపుడు ఇలాంటి అంశాలను తెరపైకి తెచ్చి సిఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడని అన్నారు. దీన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్, బిజెపిలకు బుద్ధి చెబుతారని అన్నారు.

## పాటిమీది భక్తాంజనేయ స్వామి దేవాలయంలో అన్న ప్రసాదం పంపిణీ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అమావాస్యను పురస్కరించుకొని చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం తంగడపల్లి రోడ్డు లోని పాటిమీద భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ అధ్యక్షుడు సందగళ్ళ నాగరాజుగౌడ్ మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున దేవాలయంలో అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అమావాస్య రోజు అన్న ప్రసాదం నిర్వహించడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఊడుగు రమేష్‌గౌడ్, తిరందాస్ జగన్నాథ్, మునుగుంట్ల సత్యనారాయణ, గౌడ్, దొడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మీసేవ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలోని పలు మండలాల్లోగల మీ సేవా కేంద్రాలను ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు, టి.జి.టి.ఎస్ జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చంద్రుగొండ, అన్నపరెడ్డిపల్లి, కొత్తగూడెం మండలాల్లోని మీ సేవా కేంద్రాలను తనిఖీ చేసి మీసేవ కేంద్రాల నిర్వహణ, శుభ్రత, సాంకేతిక వసతులు, సిబ్బంది ప్రవర్తన, సేవల వేగం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే ప్రజలు సమర్పిస్తున్న దరఖాస్తులు ముఖ్యంగా ఆదాయ ధ్రువపత్రాలు, మౌలిక వృత్తి ధృవపత్రాలు, రేషన్ కార్డులు, జనన/మరణ ధ్రువపత్రాలు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తులు, వాటి ప్రాసెసింగ్ స్థితిని పరిశీలించారు. మీసేవ ఆపరేటర్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రామాణిక రుసుముల ప్రకారమే ఫీజులు వసూలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. సూచిక బోర్డులు, సేవల జాబితా, సేవలకు సంబంధించిన రుసుముల వివరాలు కేంద్రంలో స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక రుసుములు వసూలు చేయరాదని, అలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను ఎట్టి విధంగానూ మోసగించకూడదనీ, పారదర్శకతతో సేవలు అందించాలనీ, ప్రతి వినియోగదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వారు సూచించారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

* జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ నుండి దేవమ్మ బస్తి వరకు చేపట్టిన రోడ్డు పనులను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు కొలుకుల జైహింద్,నాయకులు డి.పాపయ్య గౌడ్, వేణుయాదవ్,గుజ్జుల పాపిరెడ్డి,భోగ రాజేష్,రాజు,శ్రీనివాస్, సత్యనారాయణ, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన శ్రీవేణుగోపాల స్వామి ఆలయం

* ఆలయ పునః నిర్మాణం కోసం నిధులు కేటాయించండి
* మంత్రిని కలిసి కోరిన నాయకులు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: 700 సంవత్సరాలకు పైగా చరిత్ర గల ముస్తాబాద్ పట్టణ కేంద్రంలోని అతి పురాతన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని మాజీ ఎంపిటిసి సభ్యులు గుండెల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి చొరవతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను ఆయన కలిసి అతి పురాతన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ విశిష్టను వివరించారు. ఆలయం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, ఈ ఆలయ పునః నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా ఆలయ పునః నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు గజ్జెల రాజు, బద్దిపడిగే అనిల్ రెడ్డి ఉన్నారు.

## లైవ్ లో వ్యాపారం చేస్తున్న వారికే షాపులు కెటాయించాలి

* పురపాలక అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు:ఇల్లందు మున్సిపాలిటి పరిధిలో గల జగదాంబ సెంటర్ నుండి ప్రభుత్వ పాఠశాల నడుమ పురపాలక సంఘం అధ్వర్యంలో నిర్మించిన షాపులను ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య కలియ తిరిగి స్థానికంగా రోడ్డుపై వ్యాపారం కొనసాగిస్తున్న వ్యాపారులకు పురపాలక షాపులలో వ్యాపారం కొనసాగించాలని సూచన చేశారు. అనంతరం లైవ్ లో వ్యాపారం కొనసాగిస్తున్న వారికే షాపులు కెటాయించాల్సిందిగా పురపాలక అధికారులకు అదేశాలుజారి చేశారు. వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్,పురపాలక కమిషనర్ శ్రీకాంత్,నాయకులు మడుగు సాంబ మూర్తి,బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీనివాస్, హరిహరక్షేత్రం చైర్మెన్ గందె సదానందం, పురపాలక అధికారులు తదితరులు ఉన్నారు.

## బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా శ్రీనివాస్



మేడిపల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా మేడిపల్లి కి చెందిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకము తో బాధ్యతలు ఇచ్చినటువంటి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచందర్ రా వు కి వారికి జిల్లా పార్టీ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ కి , మాజీ మంత్రి , మల్కాజ్గిరి ఎం పి ఈటల రాజేందర్ కి , జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ కి జిల్లా నాయకులకు మండల నాయకులకు బోడుప్పల్ బీజేపీ నాయకులకు అందరికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా బీజేపీ పార్టీ అభివృద్ధి కోసం నా వంతుగా పూర్తి సమయం ఇచ్చి పనిచేస్తానని నా పై ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటానని అన్నారు. కేంద్ర పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లి మోడీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని అన్నారు. ప్రతి మండలం లో ని గ్రామ గ్రామానికి బీజేపీ అభివృద్ధి కి కృషి చేస్తానని తెలియజేశారు. ముఖ్యంగా బోడుప్పల్ కార్పొరేషన్ లో మా అధ్యక్షులు తో కలిసి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో విజయం కోసం నిరంతరం పనిచేస్తాననీ అన్నారు.

# కాంగ్రెస్ పార్టీపై బురద చల్లితే ఊరుకునేది లేదు

- కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య
- ఎదురుగా రండి బలబలాలు తెల్చుకుందాం
- ఆకుల ఇంద్రసేనారెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: శత్రువును సైతం అక్కున చేర్చుకునే అమ్మలాంటి కాంగ్రెస్ పార్టీపై బుదదజల్లితే ఊరుకునేది లేదని చౌటుప్పల్ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మండలంలోని దండుమల్కాపురం పరిధి సర్వేనెంబర్ 42లో 305ఎకరాల భూ ఆక్రమణకు సంబంధించి విషయంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులపై చేసిన నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఈ విషయానికి కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆ భూభాగోతం బయటకు వచ్చిందన్నారు. తప్పుడు పత్రాలతో రూ.12నుంచి 15కోట్ల భూమి చేయించుకున్నారని, చర్యలు తీసుకుంటే దొంగే దొంగ అన్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇకపై కాంగ్రెస్ ప్రభుత్వంపై, నాయకులపై అనవసర ఆరోపణలు చేస్తే అందరి బాగోతం బట్టబయలు చేస్తామని స్పష్టం చేస్తారు. మచ్చలేని నాయకుడు, శత్రువుకు సైతం న్యాయం చేసే నాయకుడు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ప్రజాపాలనే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. సంయమనం పాటిస్తున్నామని, తమ సహనాన్ని పరీక్షించ వద్దన్నారు. ఇప్పటివరకు నోరు విప్పలేదు, నోరు విప్పితే కళ్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ, మిషన్ భగీరథ వంటి పథకాల్లో జరిగిన అవినీతిని బయటపెడతామని హెచ్చరించారు.

* కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య*
- బోయ దేవేందర్

టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార దుర్వినియోగం జరిగిందని, రాజకీయ వ్యభిచారానికి పాల్పడి నకిలీ పత్రాలతో భూ కబ్జాలు చేసిన అవినీతి బకాసురుడు టిఆర్ఎస్ ప్రధాన నాయకుడని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్ ఆరోపించారు. దండు మల్కాపురం గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త ఫకీరు ప్రభాకర్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేశాడని గుర్తు చేశారు. అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.15కోట్ల భూమి తన ఖాతాలో వేసుకున్నారని దుయ్యబట్టారు. అధికారులు చట్టానికి లోబడి పనిచేసే వ్యక్తులని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటారన్నారు. ఖబర్దార్ బిడ్డలారా దొంగ, లంగ వేషాలతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం సిగ్గుమాలిన చర్య అని ఘాటుగా ఆరోపించారు.

* ఎదురుగా రండి బలబలాలు తెల్చుకుందాం
- సుర్వి నరసింహ గౌడ్

బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పును ఆధారాలతో సహా అధికారులు చూపించారని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ అన్నారు. మీరు చేసిన తప్పుకు మా నాయకుల పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మా నాయకులపై తప్పులు ఉంటే ఒక్క ఆధారం చూపించండి అంటూ సవాల్ విసిరారు. ప్రభాకర్ రెడ్డి మీరు చేసిన అన్యాయాలను సమాచార హక్కు చట్టం ద్వారా బయటపెట్టాడన్నారు. చేసిన తప్పులకు శిక్ష అనుభవించగా తప్పదన్నారు. జెడ్పిటిసి గా గెలవలేక తప్పుడు ఆరోపణలు చేశారంటూ ప్రచారం చేయడం సరికాదని, ఎదురుగా రండి బలాలు తెలుసుకుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, మాజీ ఎంపీపీ, జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, నాయకులు బక్క శ్రీనాథ్, చెన్నగోని అంజయ్య గౌడ్, వరకాంతం జంగారెడ్డి, సురుగు శ్రీనివాస్, కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, పబ్బు శ్రీకాంత్ గౌడ్, బొంగు జంగయ్య గుర్రం కొండల్, సప్పిడి సంజీవరెడ్డి, రాచకొండ భార్గవ్, అర్థ వెంకట్ రెడ్డి, గుండు మల్లయ్య, కరీమ్, హన్ను బాయ్, బాబా షరీఫ్, ఊదరి నరసింహ, కంచరకుంట్ల రాంరెడ్డి, చింతల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఉర్సు వేడుకల్లో పరిమళించిన మతసామరస్యం

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: భిన్నత్వంలో ఏకత్వంగా ఇల్లెందు హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్ 23వ ఉర్సు వేడుకలు మతసామరస్యాన్ని పరిమళింప చేస్తున్నాయి. కులమతాలకు అతీతంగా ఉర్సు వేడుకల్లో భక్తజనం పరవశించిపోతుంది. గత 23 ఏళ్లుగా ఇల్లెందు సత్యనారాయణపురం అటవీ ప్రాంతంలో వెలసిన హజరత్ నాగుల్ మీరా మౌలాచాన్ దర్గాలో గందోత్సవం గుబ్బాలిస్తుంది. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి అనంతరం వచ్చే అమావాస్య నాడు ఈ ఉర్సు వేడుకలను ఎంతో వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. రెండు రోజుల ఎంతో భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా కులమతాలకు అతీతంగా ఈ ఉర్సు వేడుకల్లో భక్తులువేడుకల్లో పాల్గొనడం చెప్పుకోదగ్గ విషయం. బుధవారం సాయంత్రం చాదర్ కార్యక్రమంతో ప్రారంభమైన ఉరుసు వేడుకలు గురువారం పట్టణంలోని నెంబర్ టు బస్తీలోని హజరత్ నాగుల్ మీరా దర్గా నుంచి నిషానీలను ప్రత్యేకంగా అలంకరించిన గుర్రపు బగ్గీలు ఇతర వాహనాల్లో పట్టణ పురవీధుల నుంచి ఊరేగింపుగా సత్యనారాయణపురం దర్గాకు తరలించారు. ఈ జూలూస్ లో శాంతికి ప్రతిరూపంగా భక్తులందరూ తెల్లని వస్త్రాలను ధరించడం ఆనవాయితీగా వస్తుంది. నిషానీల ఊరేగింపులో భాగంగా భక్తులు పవిత్ర జలాలను పోస్తూ స్వాగతం పలుకుతున్నారు. హజరత్ నాగుల్ మీరా ఉర్సు వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహిస్తే తమ కోరికలు నెరవేరుతాయి అంటూ వేడుకల్లో పాల్గొన్న భక్తులు తమ అనుభవాలను గుర్తుచేసుకుంటున్నారు. వేడుకల్లో అయ్యప్ప మాలదారులు సైతం పాల్గొనడం విశేషం. ఉర్సు వేడుకల సందర్భంగా సత్యనారాయణపురం అటవీ ప్రాంతం సుమనోహరంగా, పరిఢవిల్లుతుంది. హజరత్ నాగుల్ మీరా ఉర్సు వేడుకల్లో భాగంగా నిషానీల ఊరేగింపులో కొమ్ము నృత్యాలు, డప్పు వాయిద్యాలు, గుర్రపు విన్యాసాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అంతేకాక ప్రత్యేకమైన డప్పు వాయిద్యాలతో పట్టణంలోని పురవీధులని ఆధ్యాత్మిక చింతన అలుముకుంది. నిషానీలను దర్శించుకునేందుకు పట్టణంలోని ప్రజలు ప్రధాన రహదారులకు ఇరువైపులా నిలబడి భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. నెంబర్ 2 బస్తీ నుంచి పాత బస్టాండ్ మీదుగా జగదాంబ సెంటర్, ఆమ్ బజార్, కొత్త బస్టాండ్ ద్వారా సత్యనారాయణపురం లోని దర్గాకు నిషానీల చేరికతో జులూస్ ముగుస్తుంది.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీలో

### ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ జితేష్

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 'డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ' ప్రారంభోత్సవ కార్యక్రమానికి రానుండడంతో, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం క్యాంపస్‌లో ఏర్పాట్లను సమీక్షించారు.యూనివర్సిటీ పరిసరాలను సందర్శించిన కలెక్టర్ అకాడమిక్ బ్లాక్ రిపేర్ వర్క్స్, ఆడిటోరియం మరమ్మత్తులు, బాలురు-బాలికల హాస్టల్ పనుల పురోగతిని పరిశీలించారు. ఆడిటోరియంలో సీటింగ్, స్టేజ్ సెటప్, లైటింగ్, ఎలక్ట్రికల్ వర్క్స్ అన్నీ నాణ్యత ప్రమాణాలతో పూర్తవ్వాలని అధికారులు సూచించారు.క్యాంపస్ సుందరీకరణ, పరిశుభ్రత, పార్కింగ్ ఏర్పాట్లు, లైటింగ్ పనులపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రితో ఆవిష్కరించబోయే శిలాఫలక ప్రాంతాన్ని కూడా పరిశీలించి, అది ఆకర్షణీయంగా ఉండాలని ఆదేశించారు. వసతి గృహాల్లో ఫర్నిచర్ అమరిక, నీటి సదుపాయాలు, శౌచాలయాల మరమ్మత్తులు, హాస్టల్ పరిశుభ్రతపై సమీక్షించారు. పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటాలని, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రిన్సిపల్ డా. జగన్మోహన్ రాజుకు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన ఈ యూనివర్సిటీ ఆవిష్కరణ



విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు.ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నయా ఔరంగాజేబ్ లా తయారైన కాంగ్రెస్ ప్రభుత్వం

* బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ వై. సుదర్శన్ రెడ్డి



పిర్జాదిగూడ, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం నయా ఔరంగాజేబ్ లా తయారైందని బీజేపీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వము తెలంగాణ రాష్ట్రంలో వేగవంతమైన అభివృద్ధి కొరకు చేపడుతున్న హైవేల నిర్మాణం కొరకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ తమ అసమర్థత వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో బిఆర్ఎస్ నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు అలసత్వం వల్ల అసంపూర్తిగా నత్తనడకనడక నడుస్తున్న నేషనల్ హైవే పనులను చేతకాక హిందూ దేవాలయాలను కూల్చివేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బండి గార్డెన్స్ రోడ్ వద్ద ఉన్న బంగారు మైసమ్మ తల్లి ఆలయాన్ని తొలగిస్తామని వచ్చిన జాతీయ రహదారుల అధికారులు , ఆర్ అండ్ బి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన నారాపల్లి వద్ద ఉన్న మసీదును తొలగించే దమ్ము లేని దద్దమ్మ దద్దమ్మ ప్రభుత్వము హిందూ దేవాలయాలు మాత్రం కూల్చివేయడానికి ముందుకు రావడం దుర్మార్గమని విమర్శించారు. హిందూ దేవాలయాల జోలికొస్తే క్షమించే ప్రసక్తే లేదని బీజేపీ నాయకులు , హిందూ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పవన్ రెడ్డి, జిల్లా సెక్రటరీ జైపాల్ రెడ్డి, గీతారం,బీజేపీ ఈస్ట్ అధ్యక్షులు జమ్ముల ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు సాడగొండ కరుణాకర్ రెడ్డి,మామిడి వెంకటేశ్,మహేంద్ర రెడ్డి,స్వరూప్ చంద్ర,బాల్ రెడ్డి, దేవాలయ నిర్వాహకులు పానుగంటి రాఘవ గౌడ్, గుణకార్ గౌడ్ , బిజెపి నాయకులు,హిందూ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆయుధాలు వీడే యోచనలో మరికొందరు ముఖ్యులు!

హైదరాబాద్: నాలుగున్నర దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన మావోయిస్టు (అప్పటి పీపుల్స్ వార్) ఉద్యమం తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతోంది. వరుస ఎన్‌కౌంటర్లు... లొంగుబాట్లతో సతమతమవుతున్న పార్టీలో అగ్రనేతలే ఉద్యమపథం వీడుతున్నారు. ఇన్నాళ్లు మావోయిస్టుల్ని అక్కున చేర్చుకున్న దండకారణ్యంలో మనలేని పరిస్థితులు నెలకొనడంతో అగ్రనేతలు ఆయుధాలను వీడుతున్నారు. ప్రస్తుతం పార్టీలో కీలకంగా ఉన్న మరికొందరు సైతం ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. కొంతకాలంగా పార్టీకి ఎదురవుతున్న గడ్డు పరిస్థితుల నేపథ్యంలో ఉద్యమంలో పురోగమించే అవకాశం లేదని గ్రహించిన నేపథ్యంలోనే ఈ దిశగా అడుగులేస్తున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అబూజ్‌మడ్ గుండెకోట్‌లో మే 21న పార్టీ ప్రధాన కార్యదర్శి బస్వరాజ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన అనంతరం శ్రేణుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. మరోవైపు, ఈ ఏడాదిలోనే కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, బాలకృష్ణ, గణేశ్, కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డి, హిడ్మా మృతి చెందడం; అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగిపోవడం; చంద్రన్న, బండి ప్రకాశ్ అనారోగ్య కారణాలతో సాయుధమార్గం వీడి జనజీవన స్రవంతిలో కలవడం... పార్టీకి కోలుకోలేని దెబ్బగా మారింది. ఈ నేపథ్యంలోనే ఇద్దరు ముఖ్యనేతలు, నలుగురు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, పదుల సంఖ్యలో పార్టీ క్యాడర్ తెలంగాణ పోలీసుల సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిసేందుకు కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలుస్తోంది.





# గ్రామీణ వ్యవస్థకు 'సహకారం' జీవధార

* **వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది, రాజకీయ జోక్యాన్ని తొలగిస్తాం**
* **కెడిసిసిబి చైర్మన్ నెట్టెం రఘురామ్**

విజయవాడ: 'సహకార రంగం దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. కార్పొరేట్ సంస్థలకు దీటుగా తీర్చిదిద్దాల్సిన అవసరం' ఉది అని కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ ఉద్ఘాటించారు. గురువారం శ్యాంనగర్‌లోని 'సహకారభూమి జర్నల్ సహకార సంఘం లిమిటెడ్' కార్యాలయంలో సహకార జెండాను నెట్టెం ఆవిష్కరించారు. సంఘం కార్యదర్శి వీరమాచినేని రత్నప్రసాద్ గారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ, "నిజానికి సహకార వ్యవస్థ ఏర్పడిందే గ్రామీణ అభ్యున్నతి కోసం. భారతదేశం ప్రాథమికంగా వ్యవసాయ దేశం, ఇక్కడ దాదాపు 5 లక్షల గ్రామాలు ఉన్నాయి. వ్యవసాయ రంగానికి ప్రధానంగా తోడ్పడే ఈ సహకార వ్యవస్థను మనం కేవలం సంప్రదాయంగా చూడకుండా, కార్పొరేట్ వ్యవస్థకు, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది" అని పిలుపునిచ్చారు. తన రాజకీయ ప్రస్థానానికి ఈ రంగమే పునాది వేసిందని చైర్మన్ తెలిపారు. 1981లో కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా మొదలైన తన జీవితం ఇప్పటికీ ఈ వ్యవస్థతోనే ముడిపడి ఉందన్నారు. గ్రామీణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ అమలులో అక్కడక్కడా తప్పులు, లోపాలు జరుగుతున్నాయని, వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన సూటిగా అంగీకరించారు. "ప్రస్తుతం రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంది. ఎన్నికలు సరిగా జరగకపోవడం, పాలన సక్రమంగా అమలు కాకపోవడం వంటి కారణాల వల్ల కృష్ణాజిల్లాలోని 425 సహకార సంఘాలలో సుమారు 100 సంఘాలు సరిగా పనిచేయడం లేదు. ఈ లోపాలు గతంలో నుంచే జరుగుతున్నాయి. వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. వీటిని సరిదిద్ది, సహకార తత్వాన్ని నిజాయితీగా అమలు చేస్తాం అని ఆయన స్పష్టం చేశారు. సహకారం అంటే కేవలం ఆర్థిక లావాదేవీ కాదని, ఒక సమూహంగా ఏర్పడి, మనకు మనమే వాటాదారులుగా లబ్ధి పొందడం ద్వారా సమాజం బాగుపడుతుందని ఆయన చెప్పారు. స్కాండినేవియా వంటి అభివృద్ధి చెందిన దేశాల పురోగతికి మూలాల్లో సహకార భావన ఉందని గుర్తుచేశారు. సహకార భావనను అవగాహన చేసుకున్న ప్రతి ఒక్కరూ ఇందులో పాలుపంచుకోవాలని, కలిసి పనిచేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేడిసిసి బ్యాంక్ జనరల్ మేనేజర్ రంగబాబు, పీపుల్స్ సొసైటీ చైర్మన్ ఎల్లారావు, సహకారభూమి బ్యూరో చీఫ్ కానూరికృష్ణ, సీనియర్ జర్నలిస్టులు రంగారెడ్డి, ప్రసాదరెడ్డి, రామారావు, జి.పి. వెంకటేశ్వర్లు, మాదవి, పద్మ, సొసైటీ డైరెక్టర్లు చావా రవి, స్వాతి పాల్గొన్నారు.

## సంచలన తీర్పు
# వెలువరించిన వికారాబాద్ జిల్లా కోర్టు



వికారాబాద్: భార్య, పిల్లల్ని హత్య చేసిన కేసులో వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసింది. వికారాబాద్ జిల్లాలో 2019లో ప్రవీణ్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లల్ని చంపేశాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు. అయితే, ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు అతడికి ఉరిశిక్ష విధించింది.

## ప్రముఖ విద్యావేత్త
# చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



హైదరాబాద్: ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యకు పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. 'అద్భుత విద్యా బోధనతో యువత భవితకు బంగారు బాటలు వేసి, ఐఐటీ రామయ్యగా పేరుగాంచి, తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచిన చుక్కా రామయ్యకు జన్మదినోత్సవ శుభాకాంక్షలు' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని నిరూపించిన విద్యా వేత్త చుక్కా రామయ్య అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఐఐటీ శిక్షణ ద్వారా దశాబ్దాల పాటు ఎందరో విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చి దిద్ది, ఐఐటీ రామయ్యగా గుర్తింపు పొందారని అన్నారు. నిజాయితీ, నిబద్ధతలకు ప్రతిరూపమైన చుక్కా రామయ్య సంపూర్ణ ఆరోగ్యంతో మరెన్నో పుట్టిన రోజులు చేసుకోవాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. వేలాది మంది విద్యార్థులను ఐఐటీయన్లుగా, ఇంజినీర్లుగా తీర్చిదిద్దిన రామయ్య.. నేర్చుకోవడంలో నిత్య విద్యార్థి అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. సామాజిక సంస్కర్తగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా, ఎమ్మెల్సీగా ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేసిన ఆయన.. నేటి తరానికి స్ఫూర్తి అని కొనియాడారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హైదరాబాద్ విద్యానగర్‌లోని చుక్కా రామయ్య నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి.. శాలువాతో సన్మానించారు. పార్టీలకు అతీతంగా అందరూ గౌరవించాల్సిన వ్యక్తి చుక్కా రామయ్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. రామయ్య నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపిన వారిలో.. కేటీఆర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ఆచార్య కోదండరామ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి, కాంగ్రెస్ సీనియర్ నేత రుద్రరాజు పద్మరాజు, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, కె.రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, మాడభూషి శ్రీధర్, పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు ఉన్నారు.

## ఇంత పెద్ద దుఃఖం
# మరెవరికీ రాకూడదు: కేటీఆర్



హైదరాబాద్: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అడిక్‌మెట్‌లోని ఒకే కుటుంబంలో 18 మంది మరణించడం బాధాకరమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) అన్నారు. ఆయన అడిక్‌మెట్, రాంనగర్, విద్యానగర్ ప్రాంతాల్లో పర్యటించారు. 18 మంది మృతి చెందిన కుటుంబంతో పాటు.. ఇతర బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారికి తాము అండగా ఉంటామన్నారు. ఇప్పటికే కొందరు తమ పార్టీ నాయకులు జెడ్డా వెళ్లారని చెప్పారు. భారత దౌత్య అధికారులతో మాట్లాడి వీలైనంత సహాయం చేస్తామని తెలిపారు. ఇంత పెద్ద దుఃఖం మరెవరికీ రాకూడదన్నారు. ప్రమాద ఘటన తనతో పాటు అందరికీ బాధ కలిగించిందన్నారు. శోక సమయంలో బాధిత కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో ఈ నెల 17న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 45 మంది హైదరాబాదీలు మృతిచెందిన విషయం తెలిసిందే. యాత్రికులతో వెళ్తోన్న బస్సు.. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

## తక్షణ అఫిడవిట్ కోరుతూ..
# కడియం, దానంకు స్పీకర్ నోటీసులు



హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై వివరణ కోరుతూ.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ మరోసారి నోటీసులు ఇచ్చారు. భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్‌లోకి చేరారని ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది శాసనసభ్యులకు స్పీకర్ గతంలో నోటీసులు జారీ చేయగా.. సమాధానం ఇచ్చిన 8 మందిపై విచారణ కొనసాగుతోంది. దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం మరింత గడువు కావాలని స్పీకర్‌ను కోరారు. ఇవాళ్టితో 8 మంది ఎమ్మెల్యేలకు చెందిన పిటిషన్లపై విచారణ పూర్తి కానుండటంతో మిగతా ఇద్దరికీ స్పీకర్ మరోసారి నోటీసులిచ్చారు. తన నోటీసులకు తక్షణమే అఫిడవిట్ దాఖలు చేయాలని అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. విచారణ పూర్తయిన ఎమ్మెల్యేలకు సంబంధించి న్యాయసలహాలు, సూచనలు తీసుకున్న తర్వాత స్పీకర్ తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. నాలుగువారాల్లోగా ఈ కేసులో నిర్ణయం ప్రకటించాల్సి ఉన్నందున సభాపతి విచారణను వేగవంతం చేశారు.



## బండి సంజయ్, కేటీఆర్‌కు
# హైకోర్టులో ఊరట

హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. వారిపై నమోదైన కేసులను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. 2023లో పదోతరగతి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం నేపథ్యంలో బండి సంజయ్‌పై కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాజకీయ కక్షల కారణంగానే కేసు నమోదు చేశారని బండి సంజయ్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు, దర్యాప్తులో పూర్తి వివరాలు లేవని పేర్కొన్న హైకోర్టు.. కేసును కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2023 ఎన్నికల సమయంలో కోడ్ ఉల్లంఘించారని మాజీ మంత్రి కేటీఆర్, గోరటి వెంకన్నపై సైఫాబాద్ పీఎస్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ పథకాలపై గోరటి వెంకన్న.. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద కేటీఆర్‌ను ఇంటర్వ్యూ చేశారని, అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారని పోలీసులు పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితికి లబ్ధి చేకూర్చే విధంగా ఇంటర్వ్యూ ఉందని ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చారు. రాజకీయ లబ్ధి కోసమే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం.. కేటీఆర్, గోరటి వెంకన్నపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది.

# పోలీసు కస్టడీలో ఐబొమ్మ రవి.. ప్రశ్నిస్తున్న పోలీసులు



హైదరాబాద్: సినిమా పైరసీ కేసులో ప్రధాన నిందితుడు, ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. బషీర్‌బాగ్‌లోని సైబర్‌క్రైమ్ పీఎస్‌కు అతడిని తరలించారు. పైరసీ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇమంది రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీలోకి తీసుకొనేందుకు బుధవారం నాంపల్లి కోర్టు అనుమతి ఇచ్చింది. భారతీయ భాషల్లోని 21 వేల సినిమాలను పైరసీ చేసిన రవిని ఇటీవల నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరేబియన్ దీవులు కేంద్రంగా చేసుకొని ఆరేళ్లుగా 66 మిర్రర్ వెబ్‌సైట్లలో పైరసీ సినిమాలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించారు. 50 లక్షల మంది డేటా సేకరించి సైబర్ నేరస్థులు, గేమింగ్, బెట్టింగ్‌యాప్‌ల నిర్వాహకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో 5 రోజుల కస్టడీలో రవి నుంచి మరింత సమాచారం సేకరించాలని పోలీసులు భావిస్తున్నారు.

# కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ: హరీశ్‌రావు



హైదరాబాద్: ఫార్ములా ఈకార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించడంపై మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. "ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం'' అని హరీశ్‌రావు అన్నారు.

# ఆయుధ వ్యాపారి కేసు.. రాబర్ట్ వాద్రాపై 'ఈడీ' ఛార్జిషీట్



కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. బ్రిటన్‌కు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కేసుతో ముడిపడిన మనీలాండరింగ్ కేసులో ఈ అభియోగ పత్రాన్ని ప్రత్యేక కోర్టులో సమర్పించింది. రాబర్ట్ వాద్రాపై ఇది రెండో మనీలాండరింగ్ ఛార్జిషీట్. ఈ ఏడాది జులైలో షికోపూర్ భూముల వ్యవహారంలో ఈడీ ఆయనపై ఓ అభియోగ పత్రాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ ప్రాంగణంపై 2016లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. డిజిటల్ డేటా, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రాబర్ట్ వాద్రా పేరు వెలుగుచూసిందని, లండన్‌లోని ఓ స్థిరాస్తితో వాద్రాకు సంబంధం ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే 2017 ఫిబ్రవరిలో ఈడీ 'నగదు అక్రమ చలామణి చట్టం' కింద భండారీ తదితరులపై కేసు నమోదు చేసింది. లండన్‌లోని స్థిరాస్తికి సంబంధించి భండారీతో వాద్రా సంబంధాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో వాద్రాను విచారించింది. ఆయన ఈ ఆరోపణలను ఖండిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా.. 2016లో ఐటీ దాడులు జరిగిన వెంటనే సంజయ్ భండారీ లండన్‌కు పారిపోయాడు. అతడి అప్పగింత అభ్యర్థనను బ్రిటన్ కోర్టు తిరస్కరించింది. ఢిల్లీ కోర్టు జులైలో అతడిని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది.



## లుథియానాలో ఎన్‌కౌంటర్.. ISIతో సంబంధాలున్న ఇద్దరికి బుల్లెట్ గాయాలు!

లుధియానా: పంజాబ్‌లోని లుథియానాలో పోలీసులు, ఉగ్రవాద సంబంధాలు ఉన్న వ్యక్తులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐతో టచ్‌లో ఉన్న ఒక టెర్రర్ మాడ్యూల్‌తో వీరికి లింకులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు వ్యక్తులకు బుల్లెట్ గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఆపరేషన్‌లో పోలీసులు కీలక సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. చైనా తయారీకి చెందిన రెండు గ్రనేడ్లు వారి నుంచి లభించాయి. సరిహద్దుల మీదుగా ఐదు అధునాతన తుపాకులు, వాటికి సంబంధించిన లైవ్ బుల్లెట్లను కూడా పోలీసులు రికవరీ చేశారు. ఈ ఆయుధాలను బట్టి, వీరు పెద్ద కుట్రకు ప్లాన్ చేసినట్లు స్పష్టమవుతోంది. ఎన్‌కౌంటర్‌లో గాయపడిన ఈ ఇద్దరు వ్యక్తులకు ఐఎస్ఐతో సంబంధాలు ఉన్న ఒక ఉగ్రవాద ముఠాతో సంబంధం ఉంది. ఈ ముఠాకు చెందిన ముగ్గురిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. వారిని విచారిస్తుండగా.. ఈ వ్యక్తుల గురించి సమాచారం లభించిందని తెలుస్తోంది. పక్కా సమాచారంతో పోలీసులు వీరిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. వారు ప్రతిఘటించి కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరపాల్సి వచ్చింది.

## వృక్ష సంపద రక్షకుడు..
# 3,000 రకాల మొక్కలు.. 60 ఏళ్ల కృషి

ఎర్నాకుళం: కొచ్చి నగరం కాంక్రీట్ జంగల్‌గా మారుతున్నా.. ఎ.వి.పురుషోత్తమ కామత్ తన ఇంటిని మాత్రం పచ్చని జీవవైవిధ్య అడవిగా మార్చారు. సుమారు 60 ఏళ్లపాటు శ్రమించి, ఒకటిన్నర ఎకరం విస్తీర్ణంలో దట్టమైన అడవిని సృష్టించారు. దీంట్లో 3,000 రకాల మొక్కలు ఉండగా, వాటిలో 300 వరకు పండ్ల మొక్కలు ఉన్నాయి. స్థానిక, అరుదైన ఔషధ, సుగంధ ద్రవ్యాలు, కలప జాతులను ఇక్కడ చూడొచ్చు. ఈ అడవిలో మధ్యాహ్నం కూడా ఎండ నేలను తాకడం కష్టం. గాలి చల్లగా, స్వచ్ఛంగా ఉంటుంది. పక్షుల కిలకిలారావాలు వినిపిస్తాయి. బయటి వాతావరణం కన్నా అడవి లోపల ఉష్ణోగ్రత కనీసం మూడు డిగ్రీలు తక్కువగా ఉంటుంది. అరుదైన మొక్కల సేకరణ కోసం ఆయన ఎంతో శ్రమించారు. నక్షత్ర వనం, దశమూల, దశపుష్పం లాంటి ఔషధ మొక్కలతో పాటు చెంతురుని, అష్టవర్గ మొక్కలైన మేధా, మహామేధా లాంటి అంతరించిపోతున్న అనేక మొక్కలు ఇక్కడ కనిపిస్తాయి. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన కామత్ అంతరించిపోతున్న మొక్కలను



కాపాడాలని సంకల్పించారు. తాను చేస్తున్న బ్యాంకు ఉద్యోగానికి 1984లో రాజీనామా చేశారు. మొదట్లో పొరుగువారు నవ్వినా మొక్కల పెంపకం ఇచ్చే తృప్తి ఏ ఉద్యోగం ఇవ్వదని నమ్మారు. ప్రస్తుతం ప్రతిరోజూ మొక్కల సంరక్షణలోనే గడుపుతున్నారు.



## 136 మంది గాయకులు.. 40 గంటలు..
## 460 పాటలతో ప్రపంచ రికార్డు!

మంగళూరు: దాదాపు 136 మంది గాయకులు ఏకధాటిగా 40 గంటలపాటు ప్రముఖ బాలీవుడ్ సింగర్ కిశోర్ కుమార్‌కు చెందిన 460 పాటలను ఆలపించి రికార్డు సృష్టించారు. షోడశీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'గాతా రహే మేరా దిల్' పేరిట కేరళలోని మంగళూరు టౌన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీని ద్వారా గతంలో అహ్మదాబాద్‌లో 100 మంది సింగర్లు 36 గంటలపాటు కిశోర్ కుమార్ పాటలను పాడిన రికార్డును అధిగమించారు. ఈ కార్యక్రమాన్ని 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' ప్రతినిధులు పర్యవేక్షించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా 136 మందిని తొమ్మిది బృందాలుగా విభజించి.. ఒక్కోదాంట్లో 820 మంది ఉండేలా చూసుకున్నారు. పాట పాటకు మధ్య 59 సెకన్ల విరామానికి అనుమతి ఇచ్చారు. కర్ణాటకకు చెందినవారూ ఇందులో భాగమయ్యారు. ఈ రికార్డు తమకు ఎంతో గర్వకారణమని, కిశోర్ కుమార్‌కు నివాళి అర్పించినట్లు గాయకులు తెలిపారు.

# మేధావి' ఉగ్రవాదులు మరింత ప్రమాదకరం
## : 'సుప్రీం'లో పోలీసుల వాదన



మేధావులు ఉగ్రవాదులుగా మారితే.. క్షేత్రస్థాయిలోని వారికన్నా మరింత ప్రమాదకరంగా తయారవుతారని ఢిల్లీ పోలీసులు సుప్రీం కోర్టులో వాదించారు. డాక్టర్లు, ఇంజినీర్లు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం ఇప్పుడు ఓ ట్రెండ్‌గా మారిందన్నారు. ఢిల్లీలో 2020లో జరిగిన అల్లర్లకు సంబంధించి నిర్బంధంలో ఉన్న ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ తదితరుల బెయిల్ పిటిషన్లను తీవ్రంగా వ్యతిరేకించారు. వారికి బెయిల్ ఇవ్వొద్దని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన 'సుప్రీం' ధర్మాసనాన్ని కోరారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్ఆర్‌సీ)లకు వ్యతిరేకంగా 2020లో ఢిల్లీలో జరిగిన నిరసనలు హింసాత్మకం కావడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లకు సూత్రధారులుగా పేర్కొంటూ ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, రహమాన్ తదితరులపై ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద, అప్పటి ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఐదేళ్లుగా నిర్బంధంలో ఉంచిన సంగతి తెలిసిందే. నిందితుల వల్లే ఈ కేసులో జాప్యం జరిగిందని, దీన్ని వారు తమకు అనుకూలంగా మలుచుకోలేరని ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు 'సుప్రీం' ధర్మాసనం ఎదుట వాదించారు. 'సీఏఏ'కు వ్యతిరేకంగా ఇమామ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఆరోపిస్తూ.. సంబంధిత వీడియోలను చూపించారు. ఇమామ్ ఓ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అని పేర్కొంటూ.. ''ఈ రోజుల్లో ఓ ట్రెండ్ నడుస్తోంది. వైద్యులు, ఇంజినీర్లు తమ పనులు చేయడం లేదు. దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు'' అని వ్యాఖ్యానించారు. ''ఇవి సాధారణ నిరసనలు కావు. హింసతో కూడుకున్నవి. అంతర్జాతీయ మీడియాలో కవరేజీ కోసం.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను వాడుకున్నారు. ఆందోళనల మాటున ప్రభుత్వాన్ని మార్చడమే వారి అంతిమ ఉద్దేశం. ఆర్థిక విధ్వంసం, దేశవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించడమే వారి లక్ష్యం. మేధావులు అని అనిపించుకునే వాళ్లు క్షేత్రస్థాయి ఉగ్రవాదుల కన్నా ప్రమాదకరమైనవారు'' అని రాజు అన్నారు. బుధవారం సైతం ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. ఇది కేవలం సీఏఏకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం కాదని, సమాజాన్ని మత ప్రాతిపదికన విభజించే ప్రయత్నమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు.




## కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో సోదాలు..
# ఏకే-47 తూటాలు లభ్యం

జమ్మూకశ్మీర్‌లోని ఓ మీడియా సంస్థ కార్యాలయంలో తూటాలు లభ్యంకావడం కలకలం సృష్టిస్తోంది. పోలీసు విభాగానికి చెందిన స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ జరిపిన సోదాల్లో జమ్మూలోని కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో ఏకే47 బుల్లెట్లు దొరికాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి. క్యాట్రిడ్జ్‌లు, పిస్టల్ రౌండ్స్, మూడు గ్రనేడ్ లెవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. గురువారం ఉదయం నుంచి ఈ తనిఖీలు జరుగుతున్నాయి. కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనూరాధ భాసిన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతదేశం, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటువాదానికి అనుకూల సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. ఆమె కార్యకలాపాలు, సంబంధాలను పరిశీలించడమే దర్యాప్తు లక్ష్యమని పోలీసు వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్ టైమ్స్.. జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రముఖ మీడియా సంస్థ. దీనిని వేద్ భాసిన్ స్థాపించారు. 1954లో ఇది ప్రచురణను ప్రారంభించింది. 1964 వరకు వీక్లీగా ఉన్న ఈ పత్రిక తర్వాత డైలీగా మారింది. ఈ సోదాలపై కశ్మీర్ టైమ్స్ సీనియర్ ఎడిటర్లు ప్రబోధ్ జమ్వాల్, అనూరాధ స్పందించారు. తమను బెదిరించేందుకు, తమ గళాన్ని అణచివేసేందుకే ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ''మేం మౌనంగా ఉండకుండా మా పని కొనసాగిస్తున్నాం. అందుకే మమ్మల్ని లక్ష్యంగా చేసుకున్నారు'' అని ఆరోపించారు.

# ఇంకా కాంగ్రెస్‌లోనే ఎందుకున్నారు?
## శశి థరూర్‌పై కాంగ్రెస్ నేత ఫైర్

ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ప్రశంసిస్తూ కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు మరోసారి సొంత పార్టీ నేతలకు ఆగ్రహం తెప్పించాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ తీవ్రంగా స్పందించారు. భాజపా సిద్ధాంతాలు నచ్చితే ఇంకా కాంగ్రెస్‌లోనే ఎందుకు కొనసాగుతున్నారని థరూర్‌ను ఆయన ప్రశ్నించారు. ''శశి థరూర్ సమస్య ఏంటంటే.. ఆయనకు ఈ దేశం గురించి పెద్దగా



తెలియదు. కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా దేశానికి ఎవరైనా మంచి చేస్తున్నారని మీరు (థరూర్‌ను ఉద్దేశిస్తూ) అనుకుంటే.. అప్పుడు మీరు కూడా వారి సిద్ధాంతాలనే అనుసరించండి. ఇంకా ఎందుకు కాంగ్రెస్‌లోనే ఉన్నారు? ఈ పార్టీ నుంచి మీరు ఎంపీ కావడం వల్లేనా?'' అని సందీప్ దీక్షిత్ నిలదీశారు. కాంగ్రెస్ కంటే భాజపా, మోదీ వ్యూహాలు బాగున్నాయని భావిస్తే అందుకు తగిన ఆధారాలతో వివరణ ఇవ్వాలని థరూర్‌కు సూచించారు. అలా చేయడం లేదంటే ఆయన మోసపూరితంగా వ్యవహరిస్తున్నారనే అర్థం అంటూ ఎంపీపై విరుచుకుపడ్డారు. ఇటీవల ఓ ప్రైవేటు కార్యక్రమంలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగానికి కితాబిస్తూ థరూర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ''అభివృద్ధి కోసం భారత్ ఎంత తపనపడాలో, బ్రిటిషు కాలం నాటి మనస్తత్వాన్ని ఎలా వీడాలో ప్రధాని మోదీ తన ప్రసంగంలో తెలిపారు. ప్రపంచానికి భారత్ కేవలం 'అభివృద్ధి చెందుతున్న మార్కెట్' మాత్రమే కాదని, 'అభివృద్ధికి మోడల్' అని ప్రధాని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని తనను అందరూ ఆరోపిస్తుంటారని మోదీ చెప్పారు. కానీ ఆయన ప్రజల సమస్యల విషయంలో ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారు'' అని థరూర్ ప్రశంసించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు.

# బిహార్ ఎన్నికల్లో ఓటమి.. ప్రశాంత్ కిశోర్ మౌనవ్రతం

బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోయింది. ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహిస్తూ ప్రశాంత్ కిశోర్ ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు. ప్రధాని మోదీ, ఎన్డీయే నాయకుల సమక్షంలో నీతీశ్ కుమార్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ప్రశాంత్ కిశోర్ ఈ వ్రతం చేపట్టడం గమనార్హం. ఇటీవల ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ పరాజయానికి 100 శాతం బాధ్యత తనదేనన్నారు. తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఈ క్రమంలోనే ఒకరోజు మౌనవ్రతం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన ప్రకారం.. తాజాగా భితిహర్వా గాంధీ ఆశ్రమంలో ఈ మౌనవ్రతాన్ని చేపట్టారు. ఇది ఈరోజు మొత్తం కొనసాగుతుందని పార్టీ తెలిపింది. ఇక, ఇటీవల ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ.. అధికార కూటమిపై ప్రశాంత్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు ప్రతి నియోజకవర్గంలో 60వేల మంది లబ్ధిదారులకు నీతీశ్ ప్రభుత్వం రూ.10వేలు చొప్పున ఇవ్వకుంటే ఆ పార్టీ 25 స్థానాలకే పరిమితమయ్యేదన్నారు. ఓట్లు పొందకపోవడం నేరం కాదని, అయితే..



అవినీతి, విభజన రాజకీయాలు మాత్రం తాను చేయలేదని అధికార పక్షాన్ని ఉద్దేశిస్తూ విమర్శించారు.

## ఐఫోన్ యూజర్లకు గుడ్‌న్యూస్..

### సరికొత్త ఫీచర్‌ను తీసుకువస్తున్న వాట్సాప్..!




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ ఐఫోన్ యూజర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఐఓఎస్ యూజర్ల కోసం సరికొత్త ఫీచర్‌ను తీసుకువస్తున్నది. దాంతో ఒకే డివైజ్‌లో రెండు వాట్సాప్ అకౌంట్స్‌ను వాడుకునే సౌకర్యం అందుబాటులోకి తేబోతున్నది. ఈ అప్‌డేట్ ఐఓఎస్ బీటా వెర్షన్‌లో అందుబాటులో ఉంది. త్వరలోనే అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ ఫీచర్ అందుబాటులోకి వస్తే వేర్వేరు వ్యక్తిగత, ప్రొఫెషనల్ నంబర్లు ఉన్న వారికి మంచి ఆప్షన్‌గా మారనున్నది. ప్రతి అకౌంట్ చాట్ హిస్టరీ, బ్యాకప్స్, ప్రైవసీ సెట్టింగ్స్ భిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా ఒక వాట్సాప్ అకౌంట్‌లో ఏదైనా మెసేజ్ వచ్చిన సమయంలో.. నోటిఫికేషన్ ఏ అకౌంట్ నుంచి వచ్చిందో సైతం స్పష్టంగా చూపిస్తుంది.

సెక్యూరిటీ ఫీచర్స్‌ను మార్చే సమయంలో యాప్ లాక్ (ఫేస్ ఐడీ, పాస్‌కోడ్) సపోర్ట్ సైతం ఉంటుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ పరిమిత సంఖ్యలో యూజర్లకు టెస్టింగ్ దశలో అందుబాటులో ఉంది. విజయవంతమైతే త్వరలోనే రోలవుట్ చేసే ఛాన్స్ ఉంది. చాలా మంది ఐఫోన్స్ యూజర్స్ రెండు నంబర్లు వ్యక్తిగత, ప్రొఫెషనల్ నంబర్స్‌ను వినియోగిస్తున్నారు. కొత్త ఫీచర్‌తో వాట్సాప్ బిజినెస్ వంటి యాప్‌ల అవసరం తక్కువగా ఉంటుంది. సజావు ఒక అకౌంట్ నుంచి మరో అకౌంట్‌కి మారడం, ప్రతి అకౌంట్‌కు సొంతంగా ఐడెంటిటీ ఉంటుంది. వాస్తవానికి చాలాకాలంగా ఐఓఎస్‌లో ఇలాంటి ఫీచర్ కోసం డిమాండ్ ఉన్నది. కొత్త ఫీచర్ కారణంగా వాట్సాప్ యూజర్లు మరింత నియంత్రణ, ఫ్లెక్సిబులిటి ఇస్తుంది. ప్రస్తుతం బీటా వెర్షన్‌లో ఈ ఫీచర్ టెస్టింగ్ దశలో ఉంది. అకౌంట్‌ను జోడించేందుకు రెండో నంబర్ అవసరమవుతుంది. అప్‌డేట్, టెస్ట్ ఫ్లైట్ ఇన్‌స్టాలేషన్ అవసరం అయ్యే అవకాశం ఉంది.

## లాభాల్లో ముగిసిన సూచీలు..

### రికార్డు గరిష్ఠాలకు కాస్త దూరంలో..




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఫైనాన్షియల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలకు దన్నుగా నిలిచాయి. ఈ క్రమంలోనే గతేడాది సెప్టెంబర్‌లో నమోదు చేసిన రికార్డు గరిష్ఠాలకు కాస్త దూరంలో నిలిచాయి.

సెన్సెక్స్ ఉదయం 85,470.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,186.47) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,801.70 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 446.21 పాయింట్ల లాభంతో 85,632.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 139.50 పాయింట్ల లాభంతో 26,192.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.71గా ఉంది. గతేడాది సెప్టెంబర్ 27న సెన్సెక్స్ 85,978 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాలను తాకగా.. నిఫ్టీ 26,277 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాలను నమోదు చేసింది.

సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.14 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4063 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## 'డార్క్ ప్యాటర్న్స్'కు 26 ఇ-కామర్స్ సంస్థలు గుడ్‌బై



**న్యూఢిల్లీ:** దేశంలోని 26 ప్రముఖ ఇ-కామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్స్‌లో డార్క్ ప్యాటర్న్స్ లేవని స్వయంగా ప్రకటించాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జెప్టో, జొమాటో, స్విగ్గీ, జియోమార్ట్, బిగ్‌బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్స్ ఇందులో ఉన్నాయని తెలిపింది. డిజిటల్ మార్కెట్‌లో వినియోగదారుల హక్కుల రక్షణలో ఇదో కీలక ముందడుగుగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అభివర్ణించింది. 'డార్క్ ప్యాటర్న్స్ ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్' మార్గదర్శకాలు-2023కు అనుగుణంగా తమ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నట్లు ఈ సంస్థలు స్వీయ ప్రకటనలు సమర్పించాయి.

వినియోగదారులను తప్పుదారి పట్టించే, మోసపూరిత ఆన్‌లైన్ డిజైన్ పద్ధతులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో సంబంధిత సంస్థలు అంతర్గతంగా లేదా థర్డ్ పార్టీలతో ఆడిట్ నిర్వహించి డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి తొలగించాయి. డార్క్‌ప్యాటర్న్స్ ఏవీ తమ ప్లాట్‌ఫారాల్లో లేవని ఈ 26 సంస్థలు ప్రకటించాయని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ తెలిపింది. ఫాల్స్ అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, ఫోర్స్డ్ యాక్షన్, సబ్‌స్క్రిప్షన్ ట్రాప్, ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్, బైట్ స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్‌గైజ్డ్ అడ్వర్టైజ్‌మెంట్స్, నాగింగ్, ట్రిక్ వర్డింగ్, సాస్ బిల్లింగ్, రోగ్ మాల్వేర్స్ వంటివి డార్క్‌ప్యాటర్న్స్‌గా పేర్కొంటారు.

ఫార్మ్‌ఈజీ, జెప్టో మార్కెట్‌ప్లేస్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా, వాల్‌మార్ట్ ఇండియా, మేక్‌మైట్రిప్, బిగ్‌బాస్కెట్, జియోమార్ట్, జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, పేజ్ ఇండస్ట్రీస్, విలియమ్ పెన్, క్లియర్‌ట్రిప్, రిలయన్స్ జ్యువెల్స్, రిలయన్స్ డిజిటల్, నెట్‌మెడ్స్, టాటా 1ఎంజీ, మీషో, ఇక్సిగో, హామ్‌లేస్, అజియో, టిరా బ్యూటీ, డ్యూరోఫ్లెక్స్, కూరాడెన్ ఇండియా సంస్థలు స్వీయ ఆడిట్లు పూర్తి చేసి డార్క్ ప్యాటర్న్స్‌ను తొలగించినట్లు తెలిపాయి.

# భారత్‌కు కొత్త కెప్టెన్?





రేసులో కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు గాయాల బెడద

కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ దూరం?

గాయాల కారణంగా సిరీస్ నుంచి ఇద్దరూ ఔట్!

తాత్కాలిక కెప్టెన్సీ రేసులో కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో త్వరలో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్‌కు ముందు భారత జట్టును గాయాల బెడద తీవ్రంగా వేధిస్తోంది. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఇద్దరూ గాయాల కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో జట్టుకు తాత్కాలిక కెప్టెన్‌ను ఎంపిక చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కోల్‌కతా టెస్టులో శుభ్‌మన్ గిల్ మెడకు గాయమైంది. దీంతో అతడు వన్డే సిరీస్‌లో ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. మరోవైపు, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా గాయంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ వీరిద్దరూ సిరీస్‌కు అందుబాటులో లేకపోతే జట్టు పగ్గాలు ఎవరికి అప్పగిస్తారనే విషయంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం తాత్కాలిక కెప్టెన్సీ రేసులో కేఎల్ రాహు ల్, అక్షర్ పటేల్ ముందున్నారు. ఇద్దరికీ ఐపీఎల్‌లో జట్లకు నాయకత్వం వహించిన అనుభవం ఉంది. రాహుల్ ఢిల్లీ క్యాపి టల్స్‌కు, అక్షర్ పటేల్ పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించా రు. జాతీయ జట్టుకు నాయకత్వం వహించిన అనుభవం పరం గా చూస్తే రాహుల్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గతంలో అతను టెస్టుల్లో కూడా జట్టును నడిపించాడు. కెప్టెన్సీ ఒక భారం అంటూ ఇటీవల రాహుల్ చేసిన వ్యాఖ్యలు అతడికి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, సెలెక్ట ర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఉత్కంఠగా మారింది. అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని రాహుల్‌కు బాధ్యతలు అప్పగి స్తారా లేక యువ ఆటగాడైన అక్షర్ పటేల్‌కు అవకాశం ఇస్తారా అనేది వేచి చూడాలి.

## దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్.. హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా దూరం..!





**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌కు సీనియర్ ఆల్‌రౌండర్ హార్దిక్ ప్యాండా, ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది. ఇరుజట్ల మధ్య మూడు మ్యాచుల సిరీస్ నవంబర్ 30న ప్రారంభం కానున్నది. గాయం కారణంగా హార్దిక్ కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో పాల్గొనే అవకాశం లేదు. ప్రస్తుతం హార్దిక్ టీ20 క్రికెట్‌పై దృష్టి సారించినట్లుగా భావిస్తున్నారు. ప్రీమియర్ ఫాస్ట్ బౌలర్ల పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ వన్డే సిరీస్ నుంచి బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ సందర్భంగా హార్దిక్ గాయం కారణంగా పాకిస్తాన్‌తో జరిగే ఫైనల్‌లో ఆడలేకపోయాడు. హార్దిక్ గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఈ తరుణంలో నేరుగా మళ్లీ 50 ఓవర్ల క్రికెట్ ఆడడం ప్రమాదకరమయ్యే అవకాశం ఉంది. హార్దిక్ టీ20 ప్రపంచకప్‌పై దృష్టి సారించాడు. తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకునేందుకు హార్దిక్ మొదట సయ్యద్ ముస్తాఖ్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున బరిలోకి దిగనున్నాడు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లో బరిలోకి దిగనున్నాడు. న్యూజిలాండ్‌తో భారత్ మూడు వన్డేలు సైతం ఆడుతుంది. ఐపీఎల్ తర్వాత సీనియర్ ప్లేయర్లు 2027 వన్డే ప్రపంచకప్‌పై దృష్టి సారించనున్నారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 22 నుంచి దక్షిణాఫ్రికాతో జరుగనున్న రెండో టెస్ట్ కోసం భారత జట్టు గౌహతికి చేరుకుంది. రెండు మ్యాచుల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 0-1 తేడాతో వెనుకపడింది. సిరీస్‌ను సమయం చేయాలని భావిస్తుంది. అయితే, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడడం టీమిండియాను కలవరపెడుతున్నది.

## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ వెటరన్ ముష్ఫికర్ రహీమ్..!



**ఢాకా:** బంగ్లాదేశ్ వెటర్ ప్లేయర్ రహీమ్ చరిత్ర సృష్టించాడు. గురువారం ఢాకాలోని షేర్ బంగ్లా నేషనల్ స్టేడియంలో ఐర్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో ముష్ఫికర్ తన టెస్ట్ కెరీర్‌లో 13వ సెంచరీ చేశాడు. కెరీర్‌లో 100వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతూ.. సెంచరీ చేసిన 11వ ప్లేయర్‌గా నిలిచాడు. ఈ ఘనత సాధించిన కొంత మంది దిగ్గజ బ్యాట్స్‌మెన్ సరన స్పెషల్ టెస్ట్ క్లబ్‌లో చేరాడు. ఇంగ్లండ్‌కు చెందిన కాలిన్ కౌడ్రీ తన 100వ టెస్ట్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. 1986లో బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియాపై ఈ ఘనత సాధించాడు. పాక్‌కు చెందిన జావెద్ మియాందాద్ 1989లో ఈ క్లబ్‌లో చేరిన తొలి ఆసియా బ్యాట్స్‌మెన్‌గా రికార్డులకెక్కాడు.

ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాట్స్‌మెన్ రికీ పాంటింగ్ 2006లో దక్షిణాఫ్రికాతో సిడ్నీ టెస్ట్‌లో తన 100వ టెస్ట్‌లో డబుల్ సెంచరీ సాధించిన తొలి బ్యాట్స్‌మెన్‌గా రికార్డును నెలకొల్పాడు. ఇక డేవిడ్ వార్నర్ 2022 డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తన వందో టెస్ట్‌లో డుబల్ సెంచరీ చేసిన తొలి క్రికెటర్‌గా ఘనతకెక్కాడు. ఇదిలా ఉండగా.. ఢాకాలో జరిగిన రెండో టెస్ట్ ప్రారంభానికి ముందు ముష్ఫికర్ రహీమ్‌ను ఈ ఘనత సాధించినందుకు బీసీబీ సత్కరించింది. ఈ సందర్భంగా రెండు జెర్సీలను బహూకరించారు. తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ టెస్ట్ సహచరులు సంతకం చేసింది కాగా.. రెండోది ప్రస్తుత టెస్ట్ టీమ్ సభ్యులు సంతకాలు చేశారు. ఆ తర్వాత 100వ నెంబర్ ఉన్న క్యాప్‌తో పాటు జ్ఞాపికను అందించింది. 38 సంవత్సరాలు ముష్ఫికర్ రహీమ్ టెస్ట్ కెరీర్‌కు ముగింపు పలికే ఆలోచన లేదని బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ చైర్మన్ నజ్ముల్ అబేదిన్ స్పష్టం చేశారు.

# ఐపీఎల్ వేలం ఆపేయండి

వేలం, లీగ్ మార్పుపై రాబిన్ ఊతప్ప కీలక సూచనలు

ఐపీఎల్‌లో వేలం ప్రక్రియను తొలగించాలన్న రాబిన్ ఊతప్ప

ఏడాది పొడవునా ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి వీలు కల్పించాలన్న ఊతప్ప

రెండున్నర నెలల లీగ్ నుంచి ఆరు నెలల లీగ్‌గా మార్చాలని సూచన




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ వేలంపై మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప కీలక వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్‌ను ఆరు నెలల లీగ్‌గా మార్చాలని ఆయన సూచించాడు. మారుతున్న కాలానుగుణంగా మార్పులు చేయాలని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో వేలం ప్రక్రియను తొలగించి, ఏడాది పొడవునా ఆటగాళ్లను కొనుగోలు చేసుకోవడానికి వీలు కల్పించి, డ్రాఫ్ట్ సిస్టమ్‌కు మార్చాలని ఆయన అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌ను రెండున్నర నెలల లీగ్ నుంచి ఆరు నెలల లీగ్‌గా మార్చాలని సూచించాడు.

ఐపీఎల్‌ను స్టార్టప్ దశకు మించి తీసుకు వెళ్లడం లేదని ఆయన వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ ప్రపంచంలోనే అగ్రగామి క్రికెట్ లీగ్ అని, మారుతున్న కాలానికి తగినట్లుగా ఆలోచనలు చేయాలని అన్నాడు. వేలం ప్రక్రియను నిలిపివేసి, సంవత్సరం పొడవునా ట్రేడ్ విండోను తెరిచి ఉంచాలని సూచించాడు. వేలం పద్ధతిని పక్కన పెట్టి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకు రావాలని అన్నాడు. తాను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయాన్ని చెబుతూనే ఉన్నానని ఆయన గుర్తు చేశాడు. వారు టీవీ వినోదం గురించి మాత్రమే ఆలోచిస్తున్నట్లుగా ఉందని, డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పదని ఆయన అన్నాడు. ఇది అభిమానులను తప్పకుండా ఆకట్టుకుంటుందని, దీనిని అమలు చేయాలని సూచించాడు. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఉండవచ్చని, కానీ ఐపీఎల్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించాడు.



# ఏఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

## ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్

**టాకీస్:** తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్కులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.

మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

**MOVIE TIME**

## నేడు థియేటర్లలోకి అల్లరి నరేశ్ 12ఎ రైల్వే కాలనీ




**టాకీస్:** టాలీవుడ్ యాక్టర్ అల్లరి నరేశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న థ్రిల్లర్ ప్రాజెక్ట్ '12ఎ రైల్వే కాలనీ'. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో డాక్టర్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం 21న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అల్లరి నరేశ్ టీం ప్రమోషన్స్ లో బిజీగా ఉంది.కాగా ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఓటీటీ పార్ట్‌నర్‌ను ఫిక్స్ చేసుకుంది. ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో భారీ మొత్తానికి దక్కించు కున్నట్టు టాలీవుడ్ సర్కిల్ సమాచారం. థియాట్రికల్ రన్ తర్వాత మేకర్స్ ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నారు. 12ఎ రైల్వే కాలనీలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీకి 'పొలిమేర', 'పొలిమేర 2' ఫేం డాక్టర్ అనిల్‌విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూరుస్తున్నారు. క్కువగా కామెడీ సినిమాలెందుకు చేయడం లేదని ప్రమోషన్స్‌లో అల్లరి నరేశ్‌ను ప్రశ్నించగా .. దీనికి అల్లరి నరేశ్ స్పందిస్తూ.. కామెడీ సినిమాలు తీయాలంటే ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితులు ఉన్నాయి. మేం ఒకవేళ ఇప్పుడు కితకితలు చేస్తే.. బాడీ షేమింగ్‌తో సినిమాను పక్కన పెట్టేస్తారు. ఇప్పుడు కొన్ని విషయాలు చాలా సున్నితంగా మారాయి. కొంతమంది మనోభావాలు దెబ్బతినే అవకాశముంది. ఈ రోజుల్లో మనం కలర్, బరువుతోపాటు ఇతర సున్నిత అంశాలపై మాట్లాడకూడదన్నాడు. ప్రేక్షకుల అభిరుచి ప్రతీ పది సంవత్సరాల కోసారి మారుతూ వస్తుంది. నేను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగేకామెడీ సినిమాలు చేసేవాడిని. సుడిగాడు స్పూఫ్ సినిమా.ప్రేక్షకులు కూడా ప్రతీ కంటెంట్ పై స్పూఫ్స్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి. వాటిని సోషల్ మీడియా మీమ్స్‌ను నుంచి అస్సలు కాపీ చేయొద్దు. జనాలు ఇప్పుడు ఆర్గానిక్‌గా ఉండే సెన్సిబుల్ కామెడీని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చాడు అల్లరి నరేశ్.

## 99లకే రాజు వెడ్స్ రాంబాయి టిక్కెట్




**టాకీస్:** టాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ సినిమా శుక్రవారం 21నప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ మూవీపై బంపరాఫర్‌ని ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమా టికెట్ ధరను తగ్గించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో సింగిల్ థియేటర్‌లలో ఈ చిత్రం రూ.99లకే అందుబాటులో ఉండబోతుండగా.. మల్టీప్లెక్స్‌లలో రూ.105గా నిర్ణయించినట్లు చిత్రబృందం తెలిపింది. తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అఖిల్, తేజస్విని జంటగా నటిస్తుండగా.. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను వేణు వుడుగుల నిర్మిస్తుండగా.. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

## స్పిరిట్ కోసం టెస్ట్ షూట్..

### ప్రభాస్ మేకోవర్ చూసి సందీప్ రెడ్డి వంగా టీం షాక్..!

**టాకీస్:** అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. ఈ టాలెంటెడ్ డైరెక్టర్ ప్రస్తుతం ప్రభాస్‌తో స్పిరిట్. సినిమాను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. రీసెంట్‌గా ఓ సినిమా ఈవెంట్‌లో స్పిరిట్ షూటింగ్ ఈ నెల చివరలో మొదలవుతుందని క్లారిటీ కూడా ఇచ్చాడు సందీప్ రెడ్డి వంగా. అయితే ఇప్పుడొక ఆసక్తికర వార్త నెట్టింట హైప్ క్రియేట్ చేస్తుంది. తాజా టాక్ ప్రకారం స్పిరిట్ కోసం ప్రభాస్ టెస్టి షూట్ పూర్తయిందట.

తొలిసారి పోలీస్ గెటప్‌లో కనిపించబోతున్న ప్రభాస్ లుక్ మైండ్ బ్లోయింగ్‌గా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. టెస్ట్ సీక్వెన్స్‌లో అద్భుతమైన ప్రజెంటేషన్‌తోపాటు సినిమా కోసం తానెంత వరకు అవుట్‌పుట్ ఇవ్వగలుగుతాడో అంతకు సరిపడా గ్లింప్స్‌ను కూడా ఇచ్చేశాడట ప్రభాస్. ఇక ప్రభాస్ టెస్ట్ షూట్‌ను, ట్రాన్స్‌ఫార్మేషన్‌ను దగ్గరుండి చూసిన వారంతా షాకయ్యారని ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త హల్ చల్ చేస్తోంది. మొత్తానికి ఈ వార్తలు సినిమాపై అంచనాలు మరింత పెంచేస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే ప్రభాస్‌ను ఖాకీ డ్రెస్‌లో ఊహించుకుంటూ డిజైన్ స్టిల్స్ కొన్ని నెట్టింట వైరల్ అవుతున్నాయని తెలిసిందే.

హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో



రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా ఫైనల్ అయినట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. స్పిరిట్‌లో పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ (డాన్ లీ) మడాంగ్‌సియోక్ విలన్‌గా నటిస్తున్నాడని.. బాలీవుడ్ యాక్టర్‌ను టీంలోకి తీసుకోబోతున్నాడని తెలుస్తుండగా సందీప్ రెడ్డి వంగా టీం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌తో కలిసి సంయుక్తంగా తెరకక్కిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రాణే సంగీతం అందిస్తున్నాడు.

### కళ్యాణి ప్రియదర్శన్

## కొత్త చిత్రం ప్రారంభం

**టాకీస్:** కళ్యాణీ ప్రియదర్శన్ ఇవాళ మలయాళ చిత్ర సీమలో స్టార్ హీరోయిన్. అగ్ర కథానాయకుల సినిమాలను మించి పోయి... ఆమె నటించిన 'లోకా' పార్ట్ వన్ మూడు వందల కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. దీంతో ఒక్కసారిగా సెట్స్ మీద ఉన్న ఆమె సినిమాలకు క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం కార్తీ సరసన 'మార్షల్' సినిమాలోనూ, 'జయం' రవి 'జీనీ'లోనూ ఆమె నటిస్తోంది. అలానే 'లోకా' మూవీ సక్సెస్ తర్వాత కళ్యాణీ ప్రియదర్శన్ తో సినిమా తీయడానికి చాలామంది మేకర్స్ తహతహలాడుతున్నారు.

ఇదిలా ఉంటే... పొటెన్షియల్ స్టూడియోస్ సంస్థ తన ఏడో సినిమాను కళ్యాణ్ ప్రియదర్శన్ తో మొదలు పెట్టింది. గతంలో 'మాయ, మానగరం, మాన్ స్టర్, తానక్కరన్, ఇరుగపాత్రు, బ్లాక్' వంటి విజయవంతమైన సినిమాలను ఈ నిర్మాణ సంస్థ రూపొందించింది. ఈ సినిమాలో 'నాన్ మహానల్లా' ఫేమ్ దేవదర్శిని, వినోద్ కిషన్ కీలక పాత్రలు పోషించబోతున్నారు. ఈ మూవీతో ధీరవియం ఎస్.ఎన్. దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ప్రవీణ్ భాస్కర్, శ్రీకుమార్ దీనికి దర్శకుడితో కలిసి స్క్రీన్ ప్లే, సంభాషణలు అందిస్తున్నారు. జస్టిన్ ప్రభాకరన్ సంగీతం అందిస్తుండగా, గోకుల్ బెనోయ్ సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు.ఎస్.ఆర్. ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు, పి. గోపీనాథ్, తంగప్రభాహరన్ ఆర్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.